www.methukuseema news

Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం

తెలుగు డిజిటల్ దిన పత్రిక


హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :01 | సోమవారం | 30 సెప్టెంబర్ 2024




Published from : Hyderabad,Sanagareddy,Warangal,Nalgonda,Nizamabad,Kammam

పేజీలు :05 వేల :5:00

## రేవంత్ తుగ్లక్ చర్యలకు ఎవరూ అధైర్యపడవద్దు



మూసీ సుందరీకరణ పేరిట కూల్చివేతలు

బాధితులకు తాము అండగా ఉంటామన్న హరీశ్ రావు

బుల్డోజర్లు తమను దాటుకుని వెళ్లాలని వ్యాఖ్యలు

2

## హైదరాబాద్‌లో వందల చెరువులు ఆక్రమణకు గురయ్యాయి



హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ పునర్జీవం కార్యక్రమంలో నిర్వాసితులకు పూర్తి అవగాహన కల్పించి పునరావాస చర్యలు చేపడుతున్నామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాన్ ఫ్రాన్సిస్కోలో తెలుగు కమ్యూనిటీ అండ్ గ్రీట్ సమావేశం ఇవాళ(ఆదివారం) జరిగింది. ఈ సమావేశంలో హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో వందల చెరువులు కనపడకుండా పోయాయని చెప్పారు.చెరువులు పూర్తిగా ఆక్రమణలకు గురికాకుండా ఆపాలనేది తమ ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. మూసీ నదిలో మంచినీరు పారించడం పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన అని వివరించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడటమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పుకొచ్చారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో కుటుంబాలు ఆరోగ్యంగా జీవించేందుకు ఆ నదిని తీర్చిదిద్దాలనేది ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. కలుషితమైన మూసీ నదిలో జీవించడం ఎవరికి కూడా మంచిది కాదని భట్టి విక్రమార్క అన్నారు.

## అధైర్యపడొద్దు.. ఇళ్లు ఇస్తాం..మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,డెస్క్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : ప్రభుత్వం పక్షాన అన్నివేళల్లో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు జోడెద్లాల పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని తెలంగాణ రెవెన్యూ, గృహ, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీలో ఇవాళ (ఆదివారం) నిర్వహించిన రాష్ట్ర స్థాయి 33 జిల్లాల తహసీల్దార్లతో ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ల్యాండ్ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు జోడెద్లాల పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని తహసీల్దార్లకు సూచించారు.ప్రభుత్వ శాఖల్లో అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ ప్రత్యేకమైనదని, అలాగే అన్ని సందర్భాల్లో రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక పాత్ర పోషిస్తారని మంత్రి అన్నారు. రాష్ట్రం మొత్తంలో సుమారు 972 మంది తహసీల్దార్లు ఉన్నారని, గ్రామీణ స్థాయి, మండల స్థాయిల్లో ఉండే సమస్యలను ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అలాగే రెవెన్యూ చట్టాల సవరణలో క్షేత్రస్థాయిలో ఉండే సమస్యలకు ఇచ్చే సలహాలు, సూచనలను కూడా అవసరమైన మేరకు పరిగణలోకి తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.



## మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది







హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి సాధికారతతో పాటు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. మహిళల ఆరోగ్యమే కుటుంబాలకు బలమని, సమాజ శ్రేయస్సుకు అదే పునాది అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం కోసం మరిన్ని ఆసుపత్రులు నిర్మిస్తామని, సంబంధిత వ్యవస్థలను బలోపేతం చేస్తామని తెలిపారు.బ్రెస్ట్ క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సుధా రెడ్డి ఫౌండేషన్ నేతృత్వంలో గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరిగిన 'పింక్ పవర్ రన్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పక్షి అకృతిలో అతిపెద్ద మానవహారంగా ఏర్పడిన వలంటీర్లను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ , శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి , వివిధ శాఖల ఉన్నతాధికారులు, పలువురు వైద్యులు, సుధా రెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎయిర్ పోర్టుకు మెట్రో రైలు మార్గం కరారు



హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.. తెలంగాణ ప్రభుత్వం. ఆరాంఘర్-బెంగుళూరు హైవే, కొత్త హైకోర్టు మీదుగా విమానాశ్రయానికి మెట్రో లైన్ ఖరారు చేసింది. కారిడార్-4లో భాగంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకూ 36.6 కిలోమీటర్ల మార్గానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎయిర్ పోర్ట్ కారిడార్‌లో 1.6 కిలోమీటర్ల మెట్రో లైను భూగర్భం నుంచి వెళ్లనుంది. ఈ మార్గంలో ఎయిర్ పోర్ట్ స్టేషన్ సహా మొత్తం 24 మెట్రో స్టేషన్లు ఉంటాయి.మెట్రో కారిడార్-5 రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు బయో డైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ నియోపోలిస్ మీదుగా నిర్మిస్తారు. ఇది మొత్తం ఎలివేటెడ్ కారిడార్. ఇందులో దాదాపు 8 స్టేషన్లు ఉంటాయి. కారిడార్-6లో ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణ్ గుట్ట వరకు గ్రీన్ లైన్ నిర్మిస్తారు. కారిడార్-7లో మార్గం ముంబై హైవేపై రెడ్ లైన్‌కు కొనసాగింపుగా నిర్మిస్తున్నారు. ఇది ప్రస్తుతం ఉన్న మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి స్టార్టయి..పటాన్‌చెరు వరకు నిర్మిస్తారు. 13.4 కిలోమీటర్ల ఈ మార్గంలో 10 స్టేషన్లు ఉంటాయి. కారిడార్-8 విజయవాడ హైవేపై ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ వరకు 7.1 కి.మీ మార్గం నిర్మిస్తారు. ఈ పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌లో దాదాపు 6 స్టేషన్లు ఉంటాయి.ప్రస్తుతం 3 కారిడార్లలో 69 కిలోమీటర్ల మేర హైదరాబాద్‌లో మెట్రో సర్వీసులు నడుస్తున్నాయి. 116.2 కిలోమీటర్లలో 32 వేల 237 కోట్ల అంచనా వ్యయంతో రెండో దశ పనులు చేపట్టనున్నారు. రెండో దశ కూడా పూర్తయితే మొత్తం 9 కారిడార్లలో 185 కిలోమీటర్ల మెట్రో మార్గం అందుబాటులో ఉండనుంది. మరోవైపు 8 వేల కోట్ల అంచనాతో ఫ్యూచర్ సిటీకి మెట్రో సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## హైదరాబాదులో పలు ప్రాంతాల్లో భారీ వర్షం



హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : హైదరాబాదు నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, మాదాపూర్, గోల్కొండ, పటాన్ చెరు, హైటెక్ సిటీ, పంజాగుట్ట, చేవెళ్ల, లక్డీకాపూల్, టోలీచౌకి, బంజారాహిల్స్, మియాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, షేక్ పేట, శేరిలింగంపల్లి, ఎర్రగడ్డ, ఫిలింనగర్, మాసాబ్ ట్యాంక్, మొయినాబాద్, ఎస్సార్ నగర్, గోల్కొండ, చందానగర్, నాంపల్లి, గచ్చిబౌలి, కొండాపూర్, శంకర్ పల్లి, ఖైరతాబాద్ ప్రాంతాలను భారీ వర్షం ముంచెత్తింది. దాంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లు జలమయం కాగా, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మరో గంట పాటు నగరానికి భారీ వర్ష సూచన ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# రేవంత్ తుగ్లక్ చర్యలకు ఎవరూ అధైర్యపడవద్దు

హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ సుందరీకరణ, హైడ్రా పేరిట రేవంత్ రెడ్డి తుగ్లక్ చర్యలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు విమర్శించారు. బాధితులు ధైర్యంగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని అన్నారు. మూసీ, హైడ్రా బాధితులకు అండగా బీఆర్ఎస్ నేతలు ఇవాళ హైదర్‌షాకోట్‌లో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం మీ ఇళ్లు ముట్టుకోకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరం వచ్చి రక్షణ కవచంలా నిలబడతాం అని హరీశ్ రావు పేర్కొన్నారు. బుల్డోజర్లు వస్తే ముందు మమ్మల్ని ఎత్తాలే తప్ప, మీ ఇళ్లను తాకే ప్రశ్నే లేదు అని. భరోసా ఇచ్చారు. ఇదే మూసీ నదిపై కొత్తగా ఆరు పెద్ద పెద్ద బహుళ అంతస్తు భవనాలు నిర్మిస్తున్నారని, పేదల ఇళ్లను కూల్చివేసే రేవంత్ రెడ్డి... ఆ కొత్త భవనాలను ఎందుకు కూల్చివేయడం లేదు? అని ప్రశ్నించారు. పేదవాళ్లు నోరు లేని వాళ్లని, ఏంచేసినా ఎవరూ రారు అనుకుంటున్నావా? పేదవాళ్లకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, కేసీఆర్ తోడుంటాడని గుర్తించాలి అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. 1994లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే బాధితులందరికీ అనుమతులిచ్చింది. రేవంత్‌రెడ్డి.. మీ తప్పిదాలకు పేదలకు ఎందుకు బలికావాలి..? ఇందిరమ్మ పాలన అంటే... పేదలకు కూడు, గుడ్డ, నీడ ఇచ్చేది. కానీ మీ ఇందిరమ్మ పాలన పేదల బతుకులు కూల్చే ప్రయత్నం చేస్తున్నావ్! తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది... అందుకే హస్తం గుర్తు తీసేసి, బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి. మీ బాధ చూస్తుంటే.. నా కళ్లలో నీళ్లు వస్తున్నాయ్. మీ బాధలు వింటుంటే.. మీ కన్నీళ్లు చూస్తుంటే.. రాతి గుండె కూడా కరిగిపోతుంది.. కానీ, రేవంత్ గుండె ఎందుకు కరుగతలేదో నాకు అర్థం కావాట్లేదు.రేవంత్ రెడ్డీ... మౌనం వీడి.. మూసీ సుందరీకరణ మానుకో. బయటికొచ్చి బాధితులకు భరోసా ఇవ్వు. స్కూళ్లలో, హాస్టల్స్‌లో టాయిలెట్స్ లేక ఆడపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. నీ దగ్గర పైసలు ఎక్కువుంటే ముందు వాటిని నిర్మించండి. గాంధీ ఆస్పత్రిలో మందులు లేవు... ముందు అవి కొని, పేదలకు మెరుగైన వైద్యం అందించు. రేవంత్... మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల ఉసురు పోసుకోకు... అంటూ హరీశ్ రావు హితవు పలికారు.

# మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తాం



హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చుతామని అన్నారు. సొంతిల్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇవాళ(ఆదివారం) తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు మాటిచ్చారు.అందరినీ కాపాడుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌ను వరల్డ్ బెస్ట్ సిటీగా మారుస్తామని అన్నారు. పీపీపీ కింద మూసీ ప్రాజెక్ట్ చేపడతామని ప్రకటించారు. మూసీలోకి గోదావరి నీళ్లు తీసుకువస్తామని అన్నారు. మూసీపై లింక్ రోడ్లు నిర్మిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. మూసీ ప్రక్షాళనపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ఏం చేసింది? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు.మల్లన్న సాగర్ నిర్వాసితులకు బీఆర్ఎస్ ఏం చేసింది అని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. గతంలో తాము మల్లన్నసాగర్ దగ్గరకు వెళ్తే అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. పోలీసులతో తమను అరెస్టు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు తాము బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్నామా అని మంత్రి శ్రీధర్‌బాబు నిలదీశారు.కొంతమంది అవకాశవాదులు కాంగ్రెస్ నేతలను రెచ్చగొట్టే పనిలో ఉన్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. ఎఫ్‌టీఎల్ పరిధిని దాచిపెట్టి విక్రయాలు చేసిన బిల్డర్లపై చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు హెచ్చరించారు. మూసీని పరిరక్షించుకోవాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని.. అందుకోసం చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

# టీజీపీఎస్సీ గ్రూప్1 నోటిఫికేషన్‌పై మళ్లీ రగడ.. హైకోర్టులో పిటిషన్లు దాఖలు




హైదరాబాద్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో 2022లో జారీ చేసిన గ్రూప్1 పోస్టులకు నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరొకటి జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. జి దామోదర్‌రెడ్డితోపాటు వికారాబాద్, యాదాద్రి, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మరో అయిదుగురు ఈ పిటీషన్లను దాఖలు చేశారు. జస్టిస్ పుల్లా కార్తీక్ దీనిపై విచారణ చేపట్టగా.. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది జె సుధీర్ వాదనలు వినిపించారు. 2022లో 503 పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయగా, వివిధ కారణాలతో పరీక్ష రద్దయినట్లు తెలిపారు. నాడు పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులకే ఈ నోటిఫికేషన్‌ను పరిమితం చేయాల్సి ఉందన్నారు. 503 ఖాళీలకు అదనంగా మరో 60 పోస్టులను కలిపి తాజాగా మరొకటి జారీ చేయడం చెల్లదని పేర్కొన్నారు. అదనంగా చేర్చిన 60 ఖాళీలకు విడిగా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. ఎస్టీ రిజర్వేషన్‌లను 6 నుంచి 10 శాతానికి పెంచడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక ప్రభుత్వం తరపు న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షను రద్దు చేసి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసే అధికారం టీజీపీఎస్సీకి ఉందని పేర్కొన్నారు. అదనపు ఖాళీలను చేర్చడం వల్ల అభ్యర్థులకు మరింత ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను రేపటికి (సెప్టెంబర్ 30) వాయిదా వేశారు.పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు 3, 4 తేదీల్లో ప్రవేశపరీక్షలు నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేశ్ సెప్టెంబరు 27న ఓ ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ www.pstu.cet.org నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.తెలంగాణ రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ సీట్ల భర్తీకి సెప్టెంబరు 30 నుంచి ఐసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు షెడ్యూల్ వెలువరించారు. సెప్టెంబరు 30న ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుకింగ్ ఉంటుంది. అక్టోబరు 1న ధ్రువపత్రాల పరిశీలన, అక్టోబర్ 1, 2 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు.

# కూల్చివేతల పేరిట అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించకండి.. జగ్గారెడ్డి వార్నింగ్



సంగారెడ్డి,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ హైడ్రా అధికారులకు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అల్టిమేటం జారీ చేశారు. హైడ్రా పేరుతో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించకండి అని హెచ్చరించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో కూల్చివేతల పేరిట అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించకండి అని జగ్గారెడ్డి అన్నారు.గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా ఔటర్ రింగ్ రోడ్డు లోపలికే పరిమితమని చెప్పారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు హైడ్రా విషయంలో ఎలాంటి భయాందోళనలు అక్కర్లేదని స్పష్టం చేశారు.సంగారెడ్డి ప్రజలకు తాను అండగా ఉంటానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.

# కూల్చివేతలన్నీ హైడ్రాకు ముడిపెట్టవద్దు




హైదరాబాద్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : కూల్చివేతలన్నీ హైడ్రాకు ముడిపెట్టవద్దు అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో హైడ్రా ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని తెలిపారు. వాటికి హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈరోజు రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో హైడ్రాపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సంగారెడ్డిలో హెూంగార్డు గాయపడి చనిపోతే... హైడ్రా బలి తీసుకుందనడం సరికాదని అన్నారు. సంగారెడ్డి కూల్చివేతల్లో హెూంగార్డ్ చనిపోయింది హైడ్రా వల్ల కాదని రంగనాథ్ చెప్పారు.మరోవైపు... మూసీ పరివాహక ప్రాంత బాధితుల దగ్గరకు రేపు(సోమవారం) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లనున్నారు. రేపు 4గంటలకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి మొదట రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హైదర్ గూడలో పర్యటించనున్నారు. అనంతరం అత్తాపూర్‌లోని కిషన్ బాగ్ ప్రాంతాల్లోని మూసీ ప్రాజెక్టులతో నష్టపోతున్న ప్రజలను కలవనున్నారు.

# బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తావా అంటూ కేటీఆర్ ఫైర్



హైదరాబాద్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు పోరాటం ఉద్ధృతం చేశారు. తాజాగా, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియాలో ఆసక్తికరంగా స్పందించారు.ముఖ్యమంత్రి తాను నిర్వహిస్తున్న శాఖలోనే తన బావమరిదికి చెందిన శోద కంపెనీకి రూ.1,137 కోట్లు కట్టబెట్టింది నిజం... అవినీతి నిరోధక చట్టంలోని 7, 11, 13 సెక్షన్లను ముఖ్యమంత్రి ఉల్లంఘించింది నిజం అని స్పష్టం చేశారు. బావమరిదితో లీగల్ నోటీసు పంపితే నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడడం ఆపేస్తాననుకున్నావా? బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోము. శోద అనే కంపెనీ గత రెండేళ్లుగా రూ.2 కోట్ల లాభం మాత్రమే ఆర్జించిన ఒక చిన్న కంపెనీఇక, ఢిల్లీలో ఉన్న నీ బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడడం కష్టమే. దేశంలో న్యాయ వ్యవస్థ బలంగా, నిజాయతీగా ఉంది. ఆదర్శ్ కుంభకోణంలో అశోక్ చవాన్ లాగా నువ్వు దొరికావు... రాజీనామా తప్పదు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఇందిరమ్మ ఇళ్లపై త్వరలో విధి విధానాలు



హైదరాబాద్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు మినహా మిగతా వాటిని అమలు చేస్తోంది. ఎనిమిది నెలలు గడుస్తున్నా స్పష్టమైన నిర్ణయం తీసుకోని కారణంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇంకా పట్టాలెక్కలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో చేసిన తప్పులు ఇందిరమ్మ పునరావృతం కాకూడదనే రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ప్రస్తుతం నిర్మాణమైన, అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలోనూ ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు కొన్ని పంపిణీకి నోచుకోగా, అధిక భాగం వృథాగా ఉన్నాయి. మరోవైపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి బదులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపైనే ప్రధానంగా దృష్టి సారించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. మార్గదర్శకాలు జారీ అయిన తర్వాత ప్రజాపాలనలో భాగంగా గ్రామ, పట్టణ సభల్లో స్వీకరిం చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తుది నిర్ణయాన్ని ప్రభుత్వం ఎమ్మెల్యేలకే వదిలిపెట్టింది. ఆయా గ్రామాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు తమకు అనుకూలంగా ఉండే వారికి ఇళ్లు కేటాయించేలా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవలసి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో డబుల్ ఇళ్ల మంజూరు బాధ్యత కలెక్టర్లకు అప్పగించింది. అయినా రాజకీయ ఒత్తిళ్లు పెరగడంతో పథకం నిర్వీర్యం అయింది. ప్రస్తుతం ఎమ్మెల్యేల చేతిలో ఆ ప్రక్రియ ఉండటం, గ్రామాలు, వార్డుల్లో స్థానిక నాయకుల హవా నడవనుండ టంతో అర్హులకు ఇళ్లు అందుతాయా...? అనే సందేహాలు కలుగుతున్నాయి.ప్రజాపాలనలో మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకునే అవకాశాలున్నాయి. తెల్ల రేషన్ కార్డుతోపాటు అందులో పేరు ఉన్న మహిళలకు ఇళ్లు మంజూరు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది.వివిధ వర్గాలకు రిజర్వేషన్ దామాషానా ఇళ్ల మంజూరు జరుగనుంది. దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10, బీసీ మైనార్టీలకు 50, జనరల్ కోటాలో 15 శాతం ఇళ్లు కేటాయించనున్నారు.

# 6వ సారి రక్త దానం చేసి మానవత్వం చాటుకున్నా కానిస్టేబుల్ శివ కుమార్



సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి ప్రైవేట్ అస్పత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మహిళాకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్త దానం" చేసి మానవత్వం చాటుకున్నారు కానిస్టేబుల్ "శివ కుమార్ " చౌతాకూర్ మండాలనీకి చెందిన మహిళాకు అనారోగ్యంతో సంగారెడ్డి ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతుంది.ఆమె కు చికిత్స చేసిన వైద్యుడు రోగి కి రక్తం తక్కువ ఉన్నందున రక్తం ఎక్కించాలి అన్నారు..కుటుంబ సభ్యులు వెంటనే సంగారెడ్డి బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ కి సంప్రదించడంతో ఆయన వెంటనే సంగారెడ్డి టౌన్ కానిస్టేబుల్ శివ కుమార్ నీ రక్త దానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంటనే తాము రక్త దానం చేస్తాము అని సంగారెడ్డి లైఫ్ లైన్ వాలంటరీ బ్లడ్ బ్యాంకు కు వచ్చి రక్త దానం చేశారు ఈ సందర్బంగా బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ మాట్లాడుతూ బీపీ, షుగర్, అనారోగ్య సమస్యలు లేని వారు 18 సంవత్సరాలనుండి 60 సంవత్సరాల వరకు ఎవ్వరైనా రక్త దానం చేయడానికి అర్హులు అని అన్నారు..అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి రక్త దానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. కానిస్టేబుల్ శివ కుమార్ 6 వ సారి రక్త దానం చేయడం అభినందనీయం అన్నారు .చాలా మంది రక్త దానం చేస్తే ఎక్కడ బలహీన పడుతాము అని అనుకుంటారు కానీ ఆరోగ్యంగా ఉన్నా ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒక్కసారి రక్త దానం చేస్తే మరింత ఆరోగ్యం ఉంటారు అన్నారు.. రక్త దానం చేసి ప్రాణ దాతగా నిలిచినా శివ కుమార్ కి కుటుంబ సభ్యులు రాజేందర్, నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

---

# సమస్యల పరిష్కారానికి భేల్ యాజమాన్యంతో చర్చిస్తా

## - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



రామచంద్రాపురం,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : భేల్ యాజమాన్యంతో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ విద్యుత్ నగర్ లో ఆదివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల భేల్ యాజమాన్యం విద్యుత్ నగర్ నుండి రామచంద్రాపురం వెళ్ళే రహదారి మరియు డ్రినేజీ లైన్ మూసి వేశారని కానీవాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యలను త్వరలో భేల్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు. అలాగే విద్యుత్ నగర్ నుండి ఓల్డ్ ఎంఐజి సిఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వరకు రోడ్డు కూడా గతుకుల మయం అయి ప్రమాదాలు జరుగుచున్నాయని దానిని మరమ్మతులు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ రాములు గౌడ్ , మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పావని, లచ్చిరాం నాయక్, బాబ్జి, శంషాబాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

---

# ఎన్ పి ఆర్ డి సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా టి.మల్లేశం ఎన్నిక



సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా జోగిపేట పట్టణానికి చెందిన టి మల్లేశం ఎన్నిక అయ్యారు. సెప్టెంబర్ 28నాడు సంగారెడ్డి పట్టణంలో సంఘం జిల్లా 3వ మహాసభలు జరిగాయి.ఈ మహాసభల్లో నూతన జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగింది.నూతన జిల్లా కమిటీలో అందోల్ డివిజన్ నుండి ఉపాధ్యక్షులుగా మన్నే పోచయ్య, సుభాష్ నాయక్, సహాయ కార్యదర్శులు గా సాయమ్మ, రాంచందర్, జిల్లా కమిటీ సభ్యులుగా రమాదేవి, నాగయ్య, కృపవరం, శ్రీనివాస్ గౌడ్, ఖలీల్ మియా ఎన్నిక అయ్యారు. ఈ సందర్బంగా మల్లేశం మాట్లాడుతూ జిల్లాలో వికలాంగులు ఎదురుకుంటున్న 23రకాల సమస్యలపై తీర్మానం చేయడం జరిగింది. ఈ తీర్మానల అమలు కోసం ఉద్యమం చేస్తానని టి మల్లేశం తెలిపారు. పెన్షన్ పెంపు, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్, స్వయం ఉపాధి రుణాలు, చట్టాల అమలుకోసం పోరాటాలు చేస్తామని అన్నారు.హక్కుల సాధన కోసం వికలాంగులు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు.

---

# ఉరేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య ను అధికారులు విచారణ జరిపించాలి




సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : గీతం యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య ను అధికారులు విచారణ జరిపించాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ హాస్టల్ గదిలో ఉరేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా లోని గీతం యూనివర్సిటీ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన వర్ష(19) రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీలో బీటెక్? సీఎస్?ఈ రెండో సంవత్సరం చదువుతోంది. అక్కడే బాలికల హాస్టల్ లో ఉంటోంది. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం తన హాస్టల్ గదిలో ఫ్యాన్ కు ఉరేసుకుని సూసైడ్ చేసుకుంది. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కావున అధికారులు తక్షణమే స్పందించి గీతం యూనివర్సిటీ హాస్టల్ పైన విచారణ జరిపించాలని అలాగే అమ్మాయికి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాము లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు రాజేష్ ఎస్ఎఫ్ ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణి ఎస్ఎఫ్ఐ నాయకులు ,హరీష్, అర్జున్ శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.

---

# సంగారెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరికీ నా విజ్ఞప్తి



సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మన నియోజకవర్గానికి సంబంధించిన పార్టీ నాయకులు గానీ కార్యకర్తలు గానీ ఎవరు నా కోసం గాంధీభవన్ కి రావద్దు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఎప్పుడైనా నాకు పార్టీ బాధ్యతలు ఇచ్చినప్పుడు నేను పూర్తిస్థాయిలో గాంధీభవన్లో సమయం ఇవ్వాల్సి ఉంటుంది అలాంటి సమయంలో మీరు అక్కడికి రావడం వల్ల పార్టీ నాకిచ్చిన బాధ్యతలను నిర్వర్తించే సమయంలో మీకు సమయం ఇవ్వడం కుదరదు కొంతమంది పర్సనల్గా నాకు ఇబ్బందులు ఉన్నాయంటూ గాంధీభవంలో నన్ను కలిసి ఎందుకు వస్తున్నారు ఎవరికి ఎలాంటి సమస్య ఉన్న నియోజకవర్గస్థాయిలోనే వాటికి పరిష్కారం దొరికేలా ఏర్పాటు చేయడం జరిగింది నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు ఎవరికైనా నేను ఫోను చేసే అవసరం లేకుండానే అధికారులు వల్ల పనులు చేసే లాగా ఏర్పాటు చేయడం జరిగింది గతంలో మనం అధికారంలో ఉన్న పదేళ్లపాటు ఆ తర్వాత మనం అధికారంలో లేకున్నా నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూడా అదే సిస్టం ని ఫాలో అవుతూ వచ్చాం. నేను ఎమ్మెల్యే ఉన్న సమయంలో మన ప్రభుత్వం లేకపోయినా అధికారులను బెదిరించో ఇంకోరకంగానో మీ మాట వినేలా చేశాను ఇక ఇప్పుడు మనం అధికారంలో ఉన్నాం నియోజకవర్గంలోని మొత్తం పవర్ కార్యకర్తలకే షేర్ చేశాను పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆంజనేయులు టీఎస్ఐఐ సి చైర్మన్ నిర్మల ఎప్పుడూ మీకు ఫోన్ లో అందుబాటులో ఉంటున్నారు వాళ్లతో కోఆర్డినేట్ చేసుకోండి హాస్పిటల్ కి సంబంధించిన పని ఏదైనా ఉంటే మహేందర్ చూసుకుంటాడు.పీఏ రఘు కూడా సెక్రటేరియట్లో ఫాలో అప్ చేసుకుంటున్నాడు కలెక్టర్ జాయింట్ కలెక్టర్ లతో ఏదయినా పని వున్నా రఘు ఫాలో అప్ చేస్తున్నాడు..నియోజకవర్గం లో హాస్పిటల్ పని అయినా... పర్సనల్ పని అయినా.. అధికారులు తో పని వున్నా.. వాటికోసం మనకి ఒక సిస్టమ్ వుంది... ఈ పనులు గురించి ఎవరిని ఏ సమస్య పై కలవాలి అనేది వాళ్ళ ఫోన్ నెంబర్ తో పాటు.. ఏ టైం నుంచి ఏ టైం కి ఫోన్ చేయాలనేది మీకు ఇన్ఫర్మేషన్ ఇచ్చాను.. నియోజకవర్గం లో కమీషనర్ లు..ఆర్ డి ఓ ,ఎం ఆర్ ఓ ,సి ఐ ఎస్ ఐ , ఎవరైనా మీకు రెస్పాండ్ కాకపోతే నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు..టీ ఎస్ ఐ ఐ సి చైర్మన్ నిర్మల మీకు ఫోన్ లో అందుబాటులో ఉంటున్నారు 20ఏళ్లుగా రామ్ నగర్ లో మనకు ఆఫీస్ లో టీం కార్యకర్తలు కి ప్రజలు కి అందుబాటులో ఉంటుంది. కాబట్టి సిస్టం ని ఫాలో కావాలి అని కోరుతున్నాను.. గాంధీ భవన్ దిక్కు వచ్చి మీ నేను టైమ్ ఇవ్వలేదని నారాజ్ కావొద్దు...ఫైనల్ గా చెప్పధలుచుకున్నది ఏంటంటే పవర్ మీకే షేర్ చేసిన... అది మీ దగ్గరే వుంది... నా మొహం చూడటానికి గాంధిభవన్ వచ్చే అవసరం మీకు లేదు... నేనే ప్రతి వారం సంగారెడ్డి వస్తున్న .. ఇక్కడికొచ్చి నన్ను డిస్టర్బ్ చేయకండి.. ఇదీ మీకు నా సూచన సలహా లేదా జాగ్రత్త అనుకోండి..

---

# బ్రూస్ లీ కుంపు కరాటే బెల్టు పరీక్షలు







సదాశివపేట,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సదాశివపేటలో ఆదివారం నాడు సెయింట్ ఆంటోనీస్ హై స్కూల్లో బ్రూస్ లీ కరాటే పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విచ్చేసి పోటీదారులకు బెల్టు మరియు సర్టిఫికేట్ పత్రాలను అందజేశారు. విద్యార్థులు స్వయం రక్షణకు కరాటే విద్యను నేర్చుకోవాలని, అంతేకాకుండా కరాటే నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలుగుతారన్నారు. ఈ కరాటే పోటీలు సాజిద్ గ్రాండ్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్, వైస్ చైర్మన్ చింత గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ సబిత, డానిల్, ఇన్స్పెక్టర్ డానియల్ మాస్టర్ ముజీబ్, మహమూద్, షఫీ, వంశీ, శ్రీనివాస్ అశోక్ లావణ్య బెల్ బహదూర్, ఆరిఫ్, శ్రీశైలం, అంజయ్య తదితరులు మాస్టర్లు పాల్గొన్నారు.

---

# ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు,నూతంగా వచ్చిన వారికి ఘన స్వాగతం





రాయికోడ్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : రాయికోడ్ మండల కేంద్రములో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో గత పదకొండు సంవత్సరాలు పిల్లలకు విద్యా,బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు మరియు నూతంగా వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాల విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఘనంగా వీడ్కోలు పలికారు.ముందుగా విద్యార్థులు పాఠశాల ప్రవేశ ద్వారం నుండి వరుసగా నిలబడి పూలవర్షం కురిపిస్తూ బజాభాజంత్రిలతో స్వాగతం పలికారు.తమకు విద్యా,బుద్దులు నేర్పిన గురువులకు ప్రతి తరగతి విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు సన్మానం చేసి వారి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది.అనంతరం ముఖ్య అతిథులుగా గా విచ్చేసిన మండల విద్యాధికారి అంజయ్య గారు మరియు సబ్-ఇన్స్పెక్టర్ -అఫ్ పోలీస్ వారిని సత్కరించడం జరిగింది.అంజయ్య సార్ మాట్లాడుతూ గత పదకొండు సంవత్సరాలు వెనక బడిన రాయికోడ్ మండలములో ఆంగ్ల విద్యాబ్యాసం కోసం,పిల్లల ఎదుగుదల కోసం కృషి చేసి న ఇంత మంచి ఉపాధ్యాయులు ఇక్కడి నుండి బదిలి కావడం చాలా బాధాకరం అని విచార వ్యక్తం చేయడం జరిగింది.ముఖ్యంగా పాఠశాల ప్రిన్సిపాల్ రజిని కుమారి గురించి మాట్లాడుతూ నా జీవితంలో ఇలాంటి పని చేసే ప్రిన్సిపాల్ ను నేను ఎక్కడ చూడలేదు,ప్రతి క్షణం విద్యభివృధి,పిల్లల చదువు కొరకు పరితపించేది అని కొనియాడటం జరిగింది.ఎస్ఐ మాడ్లాడుతు పిల్లల ఎదుగుదల కు వారిని ప్రయోజకులుగా తీర్చి దిద్దటానికి కృషి చేసిన ఉపాధ్యాయయులు ఇక్కడి నుండి వెళ్లడం చాలా బాధాకరం అని,ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం అని,చెప్పడం జరిగింది.బదిలీ పై వెళ్లిన రజిని కుమారి మాట్లాడుతూ గత 11సంవత్సరాలు ఇక్కడ బోధన చేయడం చాలా ఆనందము కలిగింది.మండల ప్రజలు,విద్యార్థులు మాకు అన్ని విధాలుగా సహాయం చేయడం జరిగింది అని మాతో కుటుంబ సభ్యులలాగా కలిసిపోవడం జరిగింది.మీ అందరిని విడిచి వెళ్లడం చాలా భాద ఉందని కానీ ఉద్యోగ ధర్మం తప్పడం లేదని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి అంజయ్య,ఎస్ఐ నారాయణ,నూతన ప్రిన్సిపాల్ పాపారావు,పాత ప్రిన్సిపాల్ రజినీకుమారి,రాధాకృష్ణ మెమోరియల్ కరస్పడెంట్ కవనం పాండు,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలపై ఎమ్మెల్యే తక్షణ స్పందన

## - హైమాస్ట్ లైట్లు, సింటెక్స్ ట్యాంకులు, ఫ్యాన్లు, ట్యూబుల ఏర్పాటు



నారాయణఖేడ్ ,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : నారాయణఖేడ్ పట్టణ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర బీసీ గురుకులాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేయగా పలు సమస్యలు బయల్పడ్డాయి. విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న ఆయా సమస్యలు వివరించడంతోపాటు, ఎమ్మెల్యే సైతం కొన్ని సమస్యలను గుర్తించి పరిష్కారానికి తక్షణం స్పందించారు. గురుకులం గ్రౌండ్‌లో హైమాస్ట్‌లైట్లు లేకపోవడంతో రాత్రి వేళ చీకటివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, విషకీటకాలు వచ్చే ప్రమాదం ఉందని తెలపడంతో రాత్రికి రాత్రి హైమాస్ట్ లైట్లను ఫిటింగ్ చేయించారు. డైనింగ్ హాల్‌లో అత్యవసరంగా 4 ఫ్యాన్లు, 8 ట్యూబులను ఏర్పాటు చేయించారు. చెడిపోయిన 80 ఫ్యాన్లను, ట్యూబులను అతి త్వరలో మరమ్మతులు చేయించి ఫిటింగ్ చేయించేలా మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌కు ఆదేశించారు. విద్యార్థులు కనీస అవసరాలకు నీటిని వాడుకొనేందుకు ఇబ్బందులు పడుతుండడంతో 2వేల లీటర్ల సామర్థ్యం గల రెండు సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేయించారు. చెడిపోయి వృధాగా పడేసిన ఆర్వో వాటర్ ప్లాంటును అతి త్వరలో మరమ్మతులు పూర్తి చేయించి దసరా సెలవులు పూర్తయి విద్యార్థులు వచ్చేలోపు అందుబాటులో తీసుకు వచ్చేలా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. సమస్యలను స్వయంగా పరిశీలించి తక్షణం స్పందించి పరిష్కరించడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, కౌన్సిలర్లు పర్యవేక్షించి పూర్తి చేయించారు.

# సదాశివపేట అయ్యప్ప దేవాలయంలో రక్తదాన శిబిరం

## - మున్సిపల్ పరిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ







సదాశివపేట,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి వారిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం కీ.శే వోదెల ప్రభు గుప్తా గురుస్వామి జ్ఞాపకార్థం తనయుడు వోదెల విలాస్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని- పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత బట్టల పంపిణీ కార్యక్రమానికి హాజరై స్వామి వారిని దర్శించుకొని కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సదాశివపేట పట్టణం,మండలం,పరిసర ప్రాంతాలకు చెందిన 100మంది శిబిరంలో రక్తదానం చేశారు. 100 యూనిట్ల ర క్తాన్ని ఇచ్చారన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. రక్త, నేత్ర, అవయవ దానాలపై ప్రజలు అపోహలు వీడాలని ఆయన పేర్కొన్నారు. అత్యవసర సమయంలో రక్తం అందించినట్లయితే వారికి ప్రాణాలు పోసినవారమవుతామని ఆయన అన్నారు. అనంతరం పారిశుద్ధ కార్మికులకు తన చేతుల మీదుగా ఉచిత బట్టల పంపిణీ చేశారు.ఎమ్మెల్యేను , వోదెల ప్రభుగుప్త సతీమణి అయిన వోదెల నాగ లక్ష్మి ని ఆలయ కమిటీ తరుపున సన్మానించారు.ఈ సందర్భంగా వోదెల విలాస్ గుప్తా మాట్లాడుతూ...రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.శిబిరాన్ని విజయవంతం చేయడానికి తోడ్పాటు అందించిన శ్రీ అయ్యప్ప సేవ సమితి,సంగారెడ్డి సాహితీ హాస్పిటల్ ఆటిపాముల రాము సహకరించిన, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ,జిల్లా బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పటేల్,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చింతా గోపాల్ శ్రీ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు గోనే శంకర్ గురుస్వామి,ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్ గురుస్వామి, వోదేల రవీందర్ గుప్తా గురు స్వామి,కోశాధికారి అప్రమాది రాచన్న గురుస్వామి,గౌరవ సభ్యులు మామిడి రాజు గురుస్వామి,స్థానిక కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు,నాయకులు,అయ్యప్ప స్వాములు,అయ్యప్ప భక్తులు,మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విపంచాయతీ కార్యదర్శులకు ఘన సన్మానం





రాయికోడ్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పాంపాడ్ గ్రామపంచాయతి కార్యాలయం నందు ఆదివారం నాడు గ్రామపంచాయతి కార్యదర్శి అగు సంగయ్య కు సర్పంచ్ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువ పూల మాలతో సత్కరించటం జరిగింది. అదేవిదంగా బదిలీ పై వచ్చిన నూతన కార్యదర్శి వెంకట్ ను స్వాగతం పలకడం జరిగింది. ఇట్టి కార్యక్రంలో తాజా మాజీ సర్పంచ్ శ్రీమతి. జ్ఞానబాయి కాశినాథ్,వార్డ్ మెంబర్స్, గ్రామ పెద్దలు,యువజన సంఘాలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొని ఘనంగా వీడ్కోలు పలకడం జరింది.

# కంగ్టి మండలంలో భారీ పిడుగు



నారాయణఖేడ్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా (నారాయణఖేడ్ నియోజకవర్గం ) కంగ్టి మండల పరిధిలో దేగులు వడి వాడి గ్రామంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఉరుములు మెరుపులతో అందులో వర్షం లో కూడిన స్థానిక ఊరు నడిబొడ్డున భోలే బాబా జెండా 101 ఫీట్లతో ఉన్న జెండా నేలకు ఒరిగింది పక్కన మహావృక్షం మీద పిడుగు పడగా వృక్షం క్రింద గ్రామానికి చెందిన కొంతమంది సేద తీర్చుకుంటూ ఆగారు పిడుగులతో చెట్టు సగం కాలింది భయంతో పరుగులెత్తారు జండా విరిగింది ముక్కలుగా మారింది దాంతో తృటి లో భారీ ప్రమాదం తప్పింది.

# అపురూపం ఆత్మీయ సమ్మేళనం ఒకే వేదికపై 2000-2001 మిత్ర బృందం



సదాశివపేట,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : ఉరుకులు పరుగుల జీవితం నుంచి ఊసులు పంచిన గతాన్ని కళ్ళ ముందు కనిపించేలా సదాశివపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2000 –2001 పదవ తరగతి మిత్రబృందం ఆత్మీయ సమ్మేళనం ను ఘనంగా నిర్వహించింది. మండలంలోని ఓ ఫామ్ హౌజ్ లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం 25 ఏళ్ల క్రిందటి మిత్రులందరినీ ఒకే వేదికపై కలిపింది. తరగతి గదిలో సరదాగా చేసిన అల్లరు, తరగతి బయటే గోడకుర్చీ వేసిన జ్ఞాపకాలు, ఒకరికొకరు పెట్టుకున్న నిక్ నేమ్ లు ... క్లాసులకు దుమ్మాలు కొట్టి సరదాగా గడిపిన క్షణాలను... చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మిత్రబృందం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఒకే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని వేరువేరు రంగాల్లో స్థిరపడ్డప్పటికీ మిత్ర బృందామంతా ఆత్మీయ సమ్మేళనంలో మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా మిత్ర బృందంలోని నాగుల విజయకుమార్, చిరంజీవి (చిరు)లు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం పేరిట కలుసుకున్న తమ మిత్రబృందమంతా స్నేహాన్ని బలోపేతం చేస్తూ స్నేహితుల్లో అవసరమైన వారికి అండగా నిలుస్తూ ముందుకు వెళతామన్నారు. మరో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి కుటుంబాలతో కలిసి పాల్గొంటామన్నారు. దీంతో బంధాలు బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. విద్యా,బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను కలిసి వారి ఆశీర్వచనం పొందుతామన్నారు. సమాజంలో పూర్వ విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేసుకొని మానవత్వం చాటుకునేలా సేవా కార్యక్రమాలను చేపట్టాలని వారు కోరారు.

# సంక్షేమ పథకాల్లో 5శాతం వికలాంగులకు కేటాయించాలి



సంగారెడ్డి,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు సెప్టెంబర్ 28 నాడు అత్యంత జయప్రదంగా జరిగాయి.21మండలాల నుండి 130 మంది ప్రతినిధులు హాజరు అయ్యారు. మహాసభలో 39 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగింది. జిల్లాలో వికలాంగులు ఎదురుకుంటున్న 23 సమస్యలపై తీర్మాణాలు ఏకగ్రీవంగా అమోదించడం జరిగింది.వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచి వెంటనే అమలు చేయాలి. పెండింగ్లో ఉన్న పెన్షన్స్ మంజూరు చేయాలి.ప్రతి వికలాంగునికి పెండ్లితో సంబంధం లేకుండా అంత్యోదయ రేషన్ కార్డ్స్ జారీ చేయాలి.జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి, ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ చేయాలి.ఎలాంటి షరతులు లేకుండా దరఖాస్తూ చేసిన ప్రతి ఒక్కరికి స్వయం ఉపాధి కోసం 5లక్షల ఋణం ఇవ్వాలి.ప్రతి మండలానికి 25యూనిట్స్ ఇవ్వాలి.2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి.చట్టంపై పోలీస్లు, అధికారులకు అవగాహనా కల్పించాలి.వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందెందుకు నిర్వహిస్తున్న సదరం క్యాంపు స్లాట్ 200 రెగ్యులర్, 100 రెన్యూవల్ కు పెంచాలి. సదరం క్యాంపుకు హాజరు అవుతున్న వారికి భోజనం, మంచి నీళ్లు, చైర్స్, టెంట్ సౌకర్యం కల్పించాలి.జిల్లాలోని ప్రయివేట్ పరిశ్రమాల్లో అర్హత కలిగిన వికలాంగులకు 5శాతం ఉద్యోగాలు కల్పించాలి.వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016 ప్రకారం జిల్లా, మండల స్థాయిలో కో–ఆర్డినేషన్ కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలి.జిల్లా కేంద్రంలో అందుల కోసం సౌండ్ లైబ్రరీ నిర్మించాలి.జిల్లాలోని అన్ని లైబ్రరీలాలో బ్రెయిలి, సైన్ లాంగ్వేజ్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలని తీర్మానం చేయడం జరిగింది.

# సి డి సి చైర్మన గా నియమితులైన గడిల రాం రెడ్డి కి సన్మానం



సదాశివపేట,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సి డి సి చైర్మన గా నియమితులైన గడిల రాం రెడ్డి ని నిన్న సదాశివపేట రెడ్డి పరివార్ తరపున చిరు సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సదాశివపేట పట్టణ రెడ్డి పరివార్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి కార్యదర్శి మనోజ్ రెడ్డి మరియు పాండురంగారెడ్డి ఆశి రెడ్డి మధుకర్ రెడ్డి గోపాల్ రెడ్డి సుదర్శన్ రెడ్డి దుర్గా రెడ్డి కృష్ణారెడ్డి రవీందర్ రెడ్డి వెంకట్ రెడ్డి భూషణ్ రెడ్డి మొదలగు రెడ్డి బంధువులు ఈ కార్యక్రమంలో పాలొన్నారు.

# సామాజిక సేవలో అందరు భాగస్వాములు అవ్వాలి

- పేదలకు అందుబాటులో వైద్యం
- అమేధ హాస్పిటల్స్ డైరెక్టర్ రాజేంద్ర
- బడుగు జీవులకు ఖరీదైన వైద్యం
- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య
- సామాజిక సేవలు విస్తరిస్తాం






పటాన్చెరు,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు ఏదో ఒకరకంగా సామాజిక సేవలో భాగస్వాములు అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి ఉంటుందని పటాన్ చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్ చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్ లో అమేధ హాస్పిటల్స్ సౌజన్యంతో మంజీరా విజ్ఞాన్ కేంద్రం (ఎంవికె) సిఐటియు ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమేధ హాస్పిటల్స్ యజమాన్యం వందమందికి పైగా పలు రకాల వైద్య సేవల తోపాటు ఉచిత మందులు, టెస్టులు నిర్వహించారు. అవసరమైన వారికి హాస్పిటల్ కి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పటాన్ చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతు పట్టణ ప్రాంతాలలో కొంతమేర వైద్యం అందుబాటులో ఉన్నప్పటికీ రూరల్ ఏరియాలో అవగాహన లేమితో ప్రజలు ప్రీ దయాబెటిక్, దయాబెటిక్ వంటి రోగాల బారిన పడుతు లక్షల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారని సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయటంతో పాటు వారిలో అవగాహన తో పాటు చైతన్య పరచలాని సూచించారు. అమేధ హాస్పిటల్స్ డైరెక్టర్ రాజేంద్ర మాట్లాడుతు పటాన్ చెరు పట్టణంలో హాస్పిటల్ పెట్టిన రోజు నుంచి కార్మికులు,పేద, మధ్యతరగతి వాళ్లకు కమర్షియల్ ఆలోచన తో కాకుండా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఇక ముందు కూడా సామాజిక సేవ కార్యక్రమంలో మేము భాగస్వాములు అవుతామని గ్రామాలలో అందరి సహాయ సహకారాలతో ఇలాంటి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎంవికే ఫౌండర్ రాజయ్య మాట్లాడుతు ప్రైవేటు హాస్పిటల్ వైద్యం అంటేనే ఖరీదైనదిగా భావిస్తున్న ఈ రోజుల్లో అన్ని సదుపాయాలతో 24 గంటలు వైద్య సేవలు అందిస్తూ అట్టడుగు బడుగు జీవులలో వెలుగు నింపుతున్న అమేధ హాస్పిటల్స్ యజమాన్యాన్ని అభినందించారు.మంజీరా విజ్ఞాన్ కేంద్రం (ఎంవికె) కన్వీనర్,కో కన్వీనర్ అర్జున్,అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ మా సంస్థ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా విస్తరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధనంజయ్,రాజశేఖర్, చిరంజీవి, సిఐటియు నాయకులు వాజిద్ అలీ, పాండురంగారెడ్డి నాగేశ్వరరావు, అర్జున్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు జలాలు సంగారెడ్డి జిల్లా సాగుకు ఇవ్వాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రోడ్లన్నీ గుంతలు పడితే అధికారులు ఏమీ చేస్తున్నారు
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు




సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సింగూరు జలాలు సంగారెడ్డి జిల్లా సాగుకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్లో జరిగిన పార్టీ కొట్లాపూర్ శాఖ మహాసభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాకు సింగూరు జలాలు సాగుకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏండ్లు గడుస్తున్నా సింగూరు జలాలు సంగారెడ్డి జిల్లాకు ఇవ్వకపోవడం చాలా అన్యమని అన్నారు. సింగూరు జలాలు సంగారెడ్డి జిల్లా ప్రజల హక్కు అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా సాగు కు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు.ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లన్నీ పాడై గుంతలు మయమైతుంటే జిల్లా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే గుంతల రోడ్లన్నీ బాగు చేయాలని అన్నారు. నేషనల్ హైవే పైన ఉన్న గుంతలు వెంటనే పూడ్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం యాదగిరి, ఎం నర్సింహులు, నాయకులు రాజయ్య, ప్రభాకర్, సత్తయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రిపోర్టర్ పై అమీన్ పూర్ మాఫియా దాడి



సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : పటాన్చెరు జనం సాక్షి రిపోర్టర్ సంతోష్ నాయక్ ఐలాపూర్ కు సంబంధించి పేదలకు నిర్మించుకున్నా ఇండ్ల నిర్మాణాలపై వార్తలు రాసినందుకు అనుమతులు ఎలా ఇచ్చారని ఈవోను ఒత్తిడి చేసి అధిక డబ్బులు డిమాండ్ చేసినందుకు గ్రామస్తులు పట్టుకొని ఇలా దేహ శుద్ధి చేశారు. అరాచకాలు భరించలేక, పటాన్ చెరువు జనంసాక్షి రిపోర్టర్ సంతోష్ నాయక్ ను చెట్టుకు కట్టేసి, ప్రజాకోర్టులో శిక్షించిన గ్రామస్తులు.

# వక్ఫ్ బోర్డ్ భూములను నిషేదితా జాబితా నుండి తొలగించి రైతులకు పూర్తి హక్కులు కల్పించాలి





రాయికోడ్,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని తాత, ముత్తాతల నుండి వారసత్వంగ వస్తున్న సుమారు మండల వ్యాప్తంగా ఉన్న 600 ఎకరాల భూమిని 2018సంవత్సరంలో ఆన్లైన్ లో నుంచి తొలగించి పాస్ బుక్ లను ఇవ్వలేకపోయారు, ఈ యొక్క భూములకు 2020 సంవత్సరంలో కొంతమంది నాయకులు రైతుల పక్షాన నిలబడి కోర్టులో కేసు వేసి కొట్లాడడం జరిగింది.2001గెజిట్ ప్రకారం ధరణి నుంచి తొలగించి నిషేదితా జాబితాలో పెట్టడం జరిగింది,కోర్ట్ రైతులకు రైతుబందు ఇవ్వాలని తీర్పు ఇవ్వడం జరిగింది కానీ పట్టాలు కాలేవు,అందుకు గాను శనివారం నాడు జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యులు అయినా జగదాంబ పాల్కర్ గారికి హైదరాబాద్ లోని తాజ్ కృష్ణ హెూటల్ లో కలిసి రేపర్సెంటేషన్ ఇవ్వడం జరిగింది. తాత ముత్తాతల నుండి వస్తున్న భూమి కావున వారి భూమిపై వారికి పూర్తి హక్కులు కల్పించి ఈ యొక్క భూములను నిషేధిత జాబితా నుండి తొలగించి రైతులకు పూర్తి హక్కులను కల్పించాలని వారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ 8మంది సభ్యులు, మరియు స్థానిక నాయకులు వక్ఫ బోర్డు అధ్యక్షులు రాయికోడ్ మాజీ సర్పంచ్ కేదార్ నాథ్ పాటిల్,శశిధర్ పాటిల్, ముస్లిం పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అసహాయులకు అండగా నిలవడమే వార్త లక్ష్యం



హత్నూరా,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : బలహీనుల, అసహాయులకు అండగా నిలవడమే వార్త పత్రిక ప్రధాన లక్ష్యమని వార్త సీఎండీ గిరీష్ కుమార్ సంఘీ పేర్కొన్నారు.. ఉమ్మడి మెదక్ జిల్లా వార్త పూర్వ మిత్రుల సమ్మేళనం కార్యక్రమం శివ శంకర్ అధ్యక్షతన హత్నూర మండలంలోని మల్కాపూర్ చౌరస్తా లోని వి ఎస్ ఆర్ గార్డెన్స్ లో నిర్వహించారు..ఈసందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న గిరీష్ కుమార్ సంఘీ మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర చరిత్ర లో ఒకేసారి 9 ఎడిషన్ లతో వార్త ను ప్రారంభించి ప్రజల సమస్యలే పరమావదిగా పనిచేయడం జరిగిందన్నారు.. ఈసందర్భంగా నాటి వార్త సంచలన కథనాలను, వార్త లో జర్నలిస్ట్ లకు ఇచ్చిన స్వేచ్ఛ ను గుర్తు చేసుకున్నారు..నాటి ప్రజా ఉద్యమాల్లో, తెలంగాణ ఉద్యమంలో వార్త కీలక పాత్ర పోషించిందన్నారు.. మీరు కోరుకున్నట్లు వార్త కు పూర్వ వైభవం అందించేలా కృషి చేస్తానన్నారు.. చెట్టుకొక్కరు పుట్టకొక్కరు ఉన్న పాత వార్త మిత్రులకు ఒక్కదగ్గరికి చేర్చి సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందని, కృషి చేసిన శివ శంకర్, రామ కృష్ణారెడ్డి లను ఆయన అభినందించారు.. ప్రముఖ సంపాదకులు రామచంద్రామూర్తి మాట్లాడుతూ తాను ఇండియన్ ఎక్స్ ప్రెస్, ప్రభ, ఆంధ్రజ్యోతి, %ప్తవ్జ% తదితర మీడియాలో పనిచేసినా వార్త లో పనిచేసిన సంతృప్తి ఎక్కడా కలగలేదాన్నారు.. వార్త లో ఉన్న స్వేచ్ఛ ఎక్కడా లేదని, సీఎండీ సంఘీ గారు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేమన్నారు.. నాడు ఏ బి కె ప్రసాద్ ఆధ్వర్యంలో వార్త లో మెరికల్లాంటి విలేఖరులు ఉండేవారని, తాను ఉత్సాహం తో పనిచేయడం జరిగిందన్నారు.. వార్త లో దగాపడ్డ తెలంగాణ పేరిట ప్రముఖులతో 32వ్యాసాలు వ్రాయడం జరిగిందన్నారు.. చంద్రభాను ప్రసాద్ గారితో దళిత్ డైరీ పేరిట వ్యాసాలు వ్రాయించడం జరిగిందన్నారు.. చంద్రబాబు విద్యుత్ సంస్కరణ ల పేరుతో చార్జీలు పెంచడంపై.. వరుస కథనాలు వ్రాయడం జరిగిందని, ఎంతో ఆదరణ లభించిందన్నారు.. కొత్త ప్రభుత్వం నక్సలైట్ల తో చర్చలు చేయాలని కోరడం జరిగిందన్నారు.. బి ఎస్ పి అధినేత కాన్షిరామ్ ఎప్పుడు హైదరాబాద్ వొచ్చినా వార్త కార్యాలయం కు వొచ్చి సంఘీ గారిని కలిసే వారని, ప్రజా సమస్యలు చర్చించే వారన్నారు.. ఆనాడు ఈనాడు కు ప్రత్యామ్నాయం గా వార్త నిలిచిందన్నారు.నేడు పత్రికలు పార్టీల వారీగా మారాయని .నిష్పాక్షపాతంగా ఉండే వార్త కు పునర్ వైభవం తీసుకు రావాలన్నారు..మేకిన్ వార్త ఆగేన్.. లా ముందుకు తీసుకు రావాలని కోరారు..వార్త పూర్వ ఎడిటరియల్, అడ్వార్టైజ్ సిబ్బంది లక్షణరావు, నేట్వర్క్ శ్రీనివాస్, ఉపేంద్ర, మాజీ ఎమ్మెల్సీ, వార్త పూర్వ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఆర్ సత్యనారాయణ, కల్వల మల్లిఖార్జున్ రెడ్డి, కప్పర ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ గత అనుభవాలను నెమరు వేసుకున్నారు..ఈసందర్బంగా వారిని శాలువాలతో సత్కరించి, మేమేంటోలు బహుకరించారు...కార్యక్రమం లో వార్త పూర్వ మిత్రులు సుమారు 100మంది పాల్గొన్నారు.

# బాలికపై యువకుడి అత్యాచారం



సిద్దిపేట,సెప్టెంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : అభంశుభం తెలియని బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై గ్రామస్తులు మండిపడ్డారు. ఇదేం పనంటూ నిలదీసేందుకు నిందితుడి ఇంటికి వెళ్లారు. అయితే, అప్పటికే సదరు యువకుడు పరారయ్యాడు. దీంతో కోపం పట్టలేక నిందితుడి ఇంటికి గ్రామస్తులు నిప్పు పెట్టారు. పోలీసుల ముందే ఇంటి ముందున్న కార్లను మహిళలు ధ్వంసం చేశారు. పోలీసులు అడ్డుకుంటున్నా ఆగకుండా నిందితుడి ఇంటిపై దాడి చేశారు.సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మండలం గురువన్న పేట గ్రామంలో ఘటన చోటుచేసుకుందీ.అత్యాచారం విషయం తెలిసి గ్రామస్థులంతా అక్కడికి చేరుకున్నారు. ఈ విషయం తెలిసి నిందితుడు పరారయ్యాడు.

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com